తివిరి ఇసుమున

ఆ కొట్టం హోటలు పెద్ద రద్దీగా ఏం లేదు.

హోటలు ప్రొప్రయిటరూ, సర్వరూ అన్నీ అంకాళమ్మే. అంకాళమ్మ ఆడమనిషన్న పేరేగానీ, గొంతులోనూ, వ్యవహారంలోనూ మగ మనిషే. ఆమె ఆడమనిషని అనడానికి తార్కాణం ఆమెకున్న ఇద్దరు మగపిల్లలే. మనిషి భారీగా వుంటుంది. ఏ పంజాబులోనో ఆడవాళ్ళు అలా ఉండడం జరుగుతుంది, కానీ ఆమె మాత్రం పూర్తిగా నూరు పైసల తెలుగావిడే! ఆ హోటల్లో టిఫిన్ చేయడమన్నా, కాఫీ తాగడమన్నా ఇష్టం హరిహరరావుకి. అతను ఆరై (రెవెన్యూ ఇన్‌స్పెక్టర్) అవడం వల్ల అందరికంటే చక్కటి, చిక్కటి స్ట్రాంగు కాఫీ ఇస్తుంది అంకాళమ్మ.

ఎప్పటిలాగే ఆవేళ కూడా పదకొండు గంటలయినా ఆఫీసుకు వెళ్ళకుండా టిఫిన్ తినేసి, స్ట్రాంగుకాఫీ తాగుతూ ఉన్నాడు హరిహరరావు.

“ఈ మాయ జగత్తులో మాయకానిదేదీ?” అని ప్రశ్నించాడు బైరాగి అంకాళమ్మను. హోటల్ రద్దీగా లేనందువలన కష్టమర్లకు సర్వుచేసే పని పెద్ద కొడుకుకి వదిలేసి మూలలో ఉన్న బైరాగి టేబులు ముందు కూచుని ఉంది అంకాళమ్మ.

బైరాగి వేసిన ప్రశ్నకు సమాధానం చెప్పాలని లేదు అంకాళమ్మకు. తల ఊపింది అతనే చెబుతాడులే అని. రెండుక్షణాలు అలా ఆమెను చూసి “అంతా మాయే!” అని తేల్చి చెప్పాడు బైరాగి.

ఆ మాటకు కూడా తల ఊపింది అంకాళమ్మ.

“మనం సంత చేసుకోడానికి ఈ లోకానికి వచ్చినాం.....ఇక్కడ సంత జేసుకొనేది అయిపోతూనే ఎవరికి వారు వెళ్ళిపోతానే ఉంటారు. ముందుగా సంత జేసుకున్న వాళ్ళు ముందుగా దాటుకుంటారు ఈ లోకం నుంచీ - అన్ని మతాలూ, అన్ని వేదాంతాలూ, అన్ని సిద్ధాంతాలూ ఇవేనామ్మ జెప్పేదీ.... మనం మూర్ఖంగా ఉండి తెలుసుకోలేం - అంతే. అంతా మాయ కాదేమమ్మా. నువ్వు మాయ, నేను మాయ, ఈ హోటలు మాయ, నీ యజమాని మాయ అంటే నీ మొగుడు....నీ మొగుడూ మాయే....నీ పిల్లలు మాయే...అంతా మాయ, మాయ, మాయ.....అంటూ చెప్పుకు పోతున్నాడు బైరాగి. బైరాగికి భుజాల వరకూ పెరిగిన జుత్తూ, దట్టంగా పెరిగిన గెడ్డం, మీసాలూ - ఒక్కసారిగా మాట్లాడుకుని తెల్లబడ్డట్టున్నాయి. నుదిటిమీద రూపాయి కాసంత ఎర్రటి కుంకుమ బొట్టు నిగనిగలాడుతోంది. అతని కళ్ళూ, పెదవులూ నిర్మలంగా ఉండటం వల్ల అతను

ఏం చెప్పినా నిజమేనని గుడ్డిగా నమ్మేంతగా ప్రభావితం చేస్తున్నాయి. మాటలు మాత్రం కర్నాటక రాష్ట్ర సరిహద్దులోని తెలుగు యాస ధ్వనిస్తున్నాయి.

హరిహరరావు కాఫీ తాగడం పూర్తి చేసి, సిగరెట్టు అంటించుకునేందుకు అగ్గిపెట్టెని చేతిలో సిద్ధంగా ఉంచుకున్నాడు. బైరాగి 'అంతా మాయ, మాయ, మాయ' అనడం అతన్ని ఎంతో ఆకట్టుకుంది. హరిహరరావుదో చిత్రమైన మనస్తత్వం, ఎప్పుడు ఏ సిద్ధాంతం వింటే, ఏ ఫిలాసఫీ వింటే అప్పటికి అందులోనే జీవిస్తాడు. ఇప్పుడతనికి తను ఇంతవరకూ తాగిన కాఫీ మాయగా అనిపిస్తోంది. సిగరెట్టు మాయే కదా కాల్చకుంటేనేమి అని కొంతసేపు సంశయించీ ఇదీ మాయే కదా కాల్చేద్దాం అన్న నిర్ణయానికి వచ్చేశాడు. అందుకే మాయసిగరెట్టును అంటించేసి, మాయపొగని పీల్చాడు. మాయ పెదవుల్తో మాయపొగ మాయనోటి గుండా మాయ ఊపిరితిత్తుల్లోకి పోయి, మాయ మాయగా తిరిగి రాగా, మాయ ముక్కుతో "పోన్లే పాపం", మాయ కదా అని నెమ్మదిగా వదిలేశాడు. ఆ క్షణంలో తనూ మాయగా, హోటల్ మాయగా, అంకాళమ్మ మాయగా, బైరాగి మాయగా, హోటల్ మాయగా, ఎమ్మార్వో మాయగా, పార్టీలు మాయగా - ఇలా గొలుసుగా అంతా మాయ అనిపిస్తూ, తన భార్యాపిల్లలూ మాయగా అనిపిస్తోన్నారు.

హరిహరరావు గొప్ప దేశనాయకుల సభకు వెళ్తే అట్లా దేశభక్తిలో పడి కొట్టుకు పోతాడు. తను ఈ దేశంలో పుట్టినందుకు పులకించిపోతాడు. ప్రపంచంలో తన దేశం గొప్ప, దేశంలో తన రాష్ట్రం గొప్ప, రాష్ట్రంలో తన జిల్లా గొప్ప, జిల్లాలో తన ఊరే గొప్ప. ఇలా తను ఎంతగానో పొంగి పోవడమే...

మతపరమైన మీటింగుకు వెళితే...తన మతం ప్రపంచానికి ఇచ్చిన సందేశం.... మానవాళికిచ్చిన వేదాంతం...తన మతంలో పుట్టిన గురువులు, పీఠాధిపతులు, ఇంకే మతంలోనూ ఉండరు. ఇలా అనుకుని పరవశించిపోతాడు. అర్ధనిమీలిత నేత్రాలతో తను మతం కోసం ప్రాణాలిచ్చేస్తాడు - ఓనాడు.. అంతే!

హరిహరరావులో మరో గొప్ప సుగుణం ఏంటంటే, అతన్ని ఏ విషయమైనా కొన్ని క్షణాలు మాత్రమే ఊపగలుగుతుంది. ఆ తర్వాత అతను కొన్ని క్షణాల్లో అతి మామూలు మనిషయి పోగలడు.

"అయ్యా! దేవర పిలుత్తాండాడు. రావల్లంట!" అంటూ తలారి పెన్నప్ప పిలుపుతో మాయలోంచి ఊడిపడ్డాడు హరిహరరావు. ఏమిటి అన్నట్టు చూశాడు పెన్నప్పవైపు.

"దేవర పిలుత్తాండాడు"

పెన్నప్ప పరిభాషలో 'దేవర' అంటే ' ఎమ్మార్వో' అని హరిహరరావుకి తెలుసు. ఆఫీసరు మాయ అయినా, ఆఫీసరు పిలుపు మాయ కాదుకదా అనిపించిందతనికి.

"అప్పుడే వచ్చినాడా ఎమ్మార్వో...వస్తున్నాని చెప్పు పెన్నప్పా!" అన్నాడు లేవకుండా మాయ సిగరెట్టును తాగుతూనే. సిగరెట్టును చివరి దాకా పీల్చి చెప్పు కాలితో నలిపేసి ఆఫీసుకు బయల్దేరాడు హరిహరరావు.

హరిహరరావుకు ముప్పయ్యేళ్ళ వయస్సుంటుంది. మనిషికాస్త లావుగా, ఎర్రగా, పొడుగ్గా ఉంటాడు. సాదాసీదాగా ఉండే చొక్కా, ప్యాంటూ వేసుకుంటాడు.

ఎండని తట్టుకునేందుకు కళ్ళకి అధునాతనమైన నల్ల కళ్లజోడు పెట్టుకుంటాడు. పై అధికార్లంటే ఎంతో నమ్రత, విధేయత చూపుతాడు. అందుకే అతన్ని జూనియర్ అసిస్టెంటు స్థాయినించి కూడా అధికారులు బాగా ఇష్టపడేవారు. మంచి సీట్లను కేటాయించేవారు. ఆఫీసుకొచ్చిన పార్టీలు ఎవ్వరైనా ఆఫీసరు కోసం అడగరు, హరిహరరావు కోసం వెదుకుతారు. కొత్తలో రెవెన్యూ శాఖలో ఉద్యోగం వచ్చినందుకు ఆనందం తాండవ మాడాడు. బాగా డబ్బును రెండు చేతులా సంపాదించవచ్చునని అనుకున్నాడు. అనుకున్నట్లుగానే డబ్బు సంపాదించాడు కూడా. ఈలోగా సీనియర్ అసిస్టెంటుగా ప్రమోషన్ రావడంతో, ఉద్యోగ బాధ్యతలతోపాటు పై సంపాదన కూడా పెరిగింది. దాంతో మూడు లక్షల కిమ్మత్తుగల ఇంటిప్లాటులూ, రెండు లక్షల కిమ్మత్తు గల ఇంటినీ కొనేశాడు. అయితే, అతనికా సంపాదన తక్కువేననిపించింది. వాణిజ్యశాఖ, రిజిస్ట్రేషన్, ఎక్సైజు శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా చేరేందుకు మార్గాన్ని ఏర్పరచు కున్నాడు. అరుదుగావచ్చే ప్రమోషనూ, సీనియారిటీని నష్టపోతావు అని మిత్రులు హితవు చెప్పారు. వినలేదు హరిహరరావు. తనకు సీనియారిటీ కంటే ప్రమోషను కంటే 'డబ్బే' ప్రధానం అని వాదించాడు. అయితే అతని కలలు ఫలించలేదు. సరిగ్గా అప్పుడే 'రెవెన్యూ ఇన్‌స్పెక్టరు' (కోర్సు) వచ్చిందతనికి. కర్నాటక లాటరీలో మొదటి బహుమతి తగిలినంత ఆనందపడిపోయి ఎక్సైజుకు విగనామం పెట్టి రెవిన్యూలోనే ఉండిపోయాడు.

మోటార్ బైక్‌లో ఆఫీసుకు చేరుకున్నాడు హరిహరరావు.

ఆఫీసులోకి అడుగుపెడుగుతున్నట్లే ఆఫీసంతటికీ కాఫీలు పట్టుకు రమ్మని తలారి పెన్నప్పకు డబ్బులిచ్చేసి ఎమ్మార్వోకి నమస్కరించి ఆయనకి ఎదురుగా ఉన్న కుర్చీలో కూచున్నాడు.

ఎమ్మార్వోని చూస్తే నక్క జ్ఞాపకానికి వస్తుంది హరిహరరావుకి. నక్కలు బట్టలు వేసుకోవు. అందులోనూ బ్రౌన్ రంగులో ఉన్న సఫారీ డ్రస్సు అస్సలు వేసుకోవు. గాజు ఫ్రేమ్ ఉన్న కళ్లజోడు పెట్టుకోవు. చక్కగా తల దువ్వుకోవు. కాని అతని కళ్ళు నక్క కళ్ళలా మిలమిలలాడుతూ ఉంటాయి. అతని ముక్కు నక్క ముక్కులా ముందుకుసాగి ఉంటుంది. అతని పళ్ళు నక్క పళ్ళలా ఉంటాయి. అతని చూపులు నక్క చూపుల్లా సూదుల్లా ఉంటాయి. అయినా అతను వేషభాషల వల్ల తను నక్క జాతికాదని భ్రమ కలిగించేటట్లుగా ఉంటాడు. అతని మాటలు నక్క ఊళలలా ఉండవు. పులి గాండ్రిపుల్లా ఉంటాయి. అతను నక్కలా ఉంటాడు. పులిలా గాండ్రిస్తాడు. అతను ఎప్పుడు ఇకిలిస్తాడో, ఎప్పుడు సకిలిస్తాడో, ఎప్పుడు గాండ్రిస్తాడో పామును మెళ్ళో వేసుకున్న శివుడికీ, పామ్మీద పడుకునే విష్ణుమూర్తికీ, విష్ణుమూర్తి బొడ్డులో మొలిచిన తామరపువ్వుమీద కూచున్న నాలుగు ముఖాలున్న బ్రహ్మదేవుడికీ తెలీదు.

అతని తలకి పైన గోడలకి దివంగత దేశనాయకులు గాంధీ, నెహ్రూ, రాజేంద్ర ప్రసాద్ పటాలున్నాయి. వాటివైపు నెలకోసారి కూడా చూడడతను. అవన్నీ ఇతరుల కోసం, తనకోసం ఎదురుగా ఉన్న గోడకి కలియుగదైవమని భక్తులు కీర్తించే

వెంకటేశ్వరుడి పటం మొదలుకొని షిరిడీ, సత్య సాయిబాబాల ఫోటోలు అరడజను ఉంటాయి. అవికాక టేబులుకున్న గాజు ఫలకం కింద డజను దేవతల ఫోటోలు పేర్చి ఉంటాయి. ఏ దేవుడి మీదా స్పష్టమైన భక్తి ఉన్నట్లు కనబడదు. ఏ క్షణంలో ఏ దేవుడు కాపాడతాడోనని పొద్దున్నే ఆఫీసు గదిలోకి వచ్చి తన ఉచితాసనాన్ని అలంకరించే లోపుగానే అన్నిటికీ ఒకే ఒక జనరల్ నమస్కార బాణాన్ని సంధించి వదలుతాడు. అతని భక్తి అంతా లక్ష్మీదేవి మీదనే. అందుకే ఆపటం స్టీలు ఫ్రేమ్‌లో టేబిలు మీద ఉంటుంది.

"నిన్న ఆర్డీవో ఆఫీసులో కాన్ఫరెన్సు జరిగింది హరిహరరావు!" అంటూనే కింగ్ సైజు సిగరెట్టు వెలిగించాడు ఎమ్మార్వో.

"సార్!" అన్నాడు 'అలాగా' అన్న అర్థం వచ్చేలా. అక్కడ ఏం జరిగింది అన్నట్లు మొహం పెట్టి చూశాడు ఆఫీసరు మొహంలోకి హరిహరరావు.

సిగరెట్టు పొగని అలా గాల్లోకి వదిలి, కాలింగ్ బెల్ నొక్కాడు ఎమ్మార్వో. అటెండరు వచ్చాడు. 'కాఫీలు పట్టుకురా! డబ్బులు పట్టూ!" అంటూ జేబులోంచి డబ్బు వెలికి తీస్తున్న ఫోజు ఇచ్చాడు. అట్లాంటి ఫోజులు అలవాటే హరిహరరావుకి. అందుకే నవ్వుకుంటాడు.

"అప్పుడే పెన్నప్పని కాఫీలకని పంపించినాను సార్! ఈ పాటికి వస్తుంటాడు" అన్నాడు.

"అట్లనా సరే......వెరీ గుడ్! కాన్ఫరెన్స్ గురించే కదా నేనిందాకా చెప్తూ ఉన్నింది"

"అవున్సార్!" అన్నాడు నవ్వుతూ హరహరరావు. ఎమ్మార్వో తీరుబడిగా నానుస్తూ 'కాన్ఫరెన్సు' అంటున్నాడు. అంటే ఏదో తన నెత్తిన బండ వేసే ఉద్దేశం ఉన్నట్లుగా మనసు కీడు శంకిస్తోంది. ఏ ఐదువందలో, వెయ్యో ఇవ్వమన్నారు అని అంటాడని ఊహిస్తున్నాడు హరహరరావు.

"దొంగనాకొడుకులప్పా! ఈ ఆర్డీవో ఆఫీసు నా కొడుకులూ. దొర యాడ ఉంటాడో, అంతా ఈ నా కొడుకులదే పెత్తనం. థూ థూ మనమిక్కడ ఉద్యోగాలు చేస్తున్నారనుకున్నాడా, కమీషను వ్యాపారాలు చేస్తున్నామనుకున్నాడా రాస్కెల్! బుద్ధిలేదు. ఆ సూపర్నెంటు గానికి."

ఆఫీసరు ఆర్డీవో ఆఫీసు సూపర్నెంటుని తిడుతున్నాడూ అంటే అది ఖచ్చితంగా తనకు బెల్టు వేసే ఉద్దేశమేనని అర్థమయిపోయింది హరిహరరావుకి. "దొరబిడ్డ పెండ్లంటప్పా" అన్నాడు సిగరెట్టు బూడిదని యాష్‌ట్రేలోకి రాలుస్తూ. ఎమ్మార్వో.

"అట్లనా సార్!"

"అట్లనా అంటావే.. ఆ సూపర్నెంటు ప్రతి ఎమ్మార్వోని పిలిచి అదే పనిగా చెప్పినాడప్పా! ఒక్కొక్క ఎమ్మార్వో మూడువేల రూపాయల ఇయ్యాలంట. ఒక్కోస్టాకు పాయింటు నుంచి సిఎస్‌డీటీ (సివిల్ సప్లయిస్ డిప్యూటీ తాసిల్దారు) ఒక్క వెయ్యి రూపాయలు, ఒక మూట బియ్యమూ, ఒకమూట చక్కెరా ఇయ్యాల్లంట. లెక్క వెయ్యి ఎంతయితాదో" అంటూనే సిగరెట్టును ఆత్రంగా పీల్చి గాల్లోకి ఊదాడు

ఎమ్మార్వో లెక్కవేస్తున్నట్లుగా కాసేపు గాల్లోకి చూసి - "అంటే ఈ డివిజనులో 25 మండలాలు కదా ఉండేది. స్టాకుపాయింట్లు దాదాపు 12 ఉన్నాయి. అంతా ఒక లకారానికి చేరుకుంటుంది. చెక్కరా, బియ్యం మూటలు అదనం అన్నమాట. ఇవికాక హెడ్ క్వార్టర్సులో ఎంత వసూలు చేస్తారో తెల్దు. యాడన్నా పాడయి పోనీలే గానీ, మనది మనం చూసుకుందాం. ఇప్పుడు మన వంతుకు మూడువేలు ఇయ్యాల్ల కదా! ముందు నీ వంతుకు ఎంత ఇస్తావో చెప్పూ!" అంటూ నవ్వాడు ఎమ్మార్వో - అచ్చు నక్కలా.

ప్రమాదాన్ని ముందుగా పసికట్టిన హరిహరరావు చెక్కు చెదరకుండా ఎమ్మార్వో కళ్ళల్లోకి చూస్తూ పెదాల మధ్య ఇరుకు నవ్వును బిగించి" మీరే చెప్పండి" అన్నట్లు తల నమ్రతగా ఆడించాడు.

"నాకు తెలుసు - నువ్వు చెప్పలేవు... నేనెంత చెప్తే అంతే.. నీలాంటి ఆర్ఐ ఈ అరవై మూడు మండలాల్లో ఎవరికీ లేదని నేను బల్లగుద్ది చెప్తానయ్యా!" ఆఫీసరు పొగుడుతుంటే అయిసు కావడం ప్రతి ఉద్యోగికీ ఉండే బలహీనతే. అదే ఆ సమయంలో హరిహరరావునీ ఆవహించింది.

పెన్నప్ప కాఫీ తెచ్చాడు. చక్కటి పింగాణీ కప్పులో సదరు కాఫీ ఎమ్మార్వోకీ, ఆర్ఐకీ సరఫరా అయింది.

"మంచి కాఫీనయ్యా. బాగుంది... నువ్వు తెప్పిస్తేనే కాఫీ ఇంత బావుండేది. హోటలు ఆంకాళమ్మ ఎన్నిరేషను కార్డులు చేసినావో, ఎన్ని హౌస్ సైటులు ఇప్పించావో, నాకైతే తెల్దుగాని, నీ నించీ ఆర్డరుపోతే చాలు. అతిచక్కటి, చిక్కటి కాఫీ పంపిస్తుంది" అంటూ తను వేసింది జోకే అని తెలియజెప్పేందుకు గల గల నవ్వాడు ఎమ్మార్వో.

"అదేం లేదు సార్!" అన్నాడు నవ్వుతూ హరిహరరావు. మెల్లగా కాఫీని చప్పరిస్తూ, బెల్టు దెబ్బ ఎంత మాత్రం పడుతుందా అని ఒకవైపు ఆలోచిస్తునే ఉన్నాడు.

"నువ్వు రెండు వేలు ఇయ్యవయ్యా! నేను వెయ్యేస్తే సరిపోతుంది. మూడు చెక్కుపోస్టులకు ఆరు మంది డీటీలు (డిప్యూటీ తహశీల్దారు) ఉన్నారు కదా - తలా వెయ్యి ఇయ్యమందాం. ఆఫీసు ఖర్చులకి అవే పడుంటాయి"

ఈమాట అంటూనే 'అమ్మా! నక్కనాయాలా! ఆఫీసు ఖర్చులకి ఆర్ఐ వుండగా ఆరువేలరూపాయలు ఇచ్చే మొగమేనానీది' అంటూ మనసులోనే గొణుక్కున్నాడు హరహరరావు.

మారు మాటాడకుండా - "అట్లే కానీయండి సార్!" అనేసి ఆలోచిస్తూ ఉన్నాడు. హరిహరరావు బుర్ర పాదరసంలా పనిచేయడం ప్రారంభించింది. తళుక్కుమని ఓ మెరుపు బుర్రలో మెరవడంతో శరీరంలో ఉత్సాహం పుంజుకుంది.

"మనకు నాలుగు రోజులు టైమిచ్చినారు. డబ్బు అడ్జస్టయినా, కాకున్నా, మనం అప్పు చేసైనా సరే మూడు వేలూ పంపిద్దాం. ఆతర్వాత కావల్సింటే వసూలు చేసుకుందాం! ఏమంటావ్?" అన్నాడు ఎమ్మార్వో - సూటిగా నక్క కళ్ళతో, నక్క చూపులు చూస్తూ.

"అట్లే చేద్దాంలెండి సార్!" అంటూనే లేచి ఎమ్మార్వో గదిలోంచి బయటికి వచ్చేశాడు. అతనికి మహా ఉత్సాహంగా ఉంది. గంతులేద్దామా అనిపిస్తోంది. ఆహా దొర కూతురి పెళ్ళి, ఓహో దొర కూతురి పెళ్ళి, అందరితో అరిచి చెబుదామా అనిపిస్తోంది. ఆఫీసు స్టాఫు చూస్తారని మానుకున్నాడు.

★ ★ ★

హరిహరరావు అసలే అద్భుతమైన ప్రతిభాశాలి. ఎడారిలో పెడితే ఇసుకని కిలో ఇరవై రూపాయలు వంతున అక్కడి మనుషులకి అమ్మివేసే రకం. తివిరి ఇసుమున తైలము తీసే హరిహరరావుకు నువ్వులు ఇచ్చి నూనె తీసిపెట్టమనడం ఒక లెక్కా? నువ్వుల మంత్రం జపించాడు - 'దొరబిడ్డ పెండ్లి" అంటూ. ప్రతి హోల్‌సేల్ డీలర్నీ, ఎఫ్‌పీషాపు డీలర్నీ సందర్శించాడు. లెక్కల్ని చెక్ చేసి పారేస్తానన్నాడు. రిజిష్టర్లు సరిగా మెయింటైన్ చేయలేదని హూంకరించాడు. లైసెన్సు సస్పెండు చేసేందుకు రికమెండ్ చేసేస్తానన్నాడు. కిరాణా షాపుల వాళ్ళని అదిరించాడు. చక్కెర, బియ్యం స్టాకుకి కొన్న బిల్లుల్ని చూపించమన్నాడు. భారతదేశంలో అమ్మకం రూల్సన్నీ కాగితాలకే పరిమితమని వ్యాపారస్తులకీ తెలుసు. అందుకే సరుకులు కొన్నందుకూ, అమ్మినందుకూ రసీదులు పుచ్చుకోరూ, ఇవ్వరూ. ఈ బలహీనతపై కూడా డబ్బు చేసుకున్నాడు హరిహరరావు. "ఎవరయినా ఇదేం పనీ" అని అడిగితే. "ఈ పాపం నాది కాదు, 'దొరబిడ్డ పెళ్ళి' ఇందులో నాజేబులోకేం రాదు" అనేవాడు.

గడువు లోపలే ఎమ్మార్వోకి డబ్బు ఇచ్చేశాడు హరిహరరావు - తన జేబులో పదివేలు వేసుకుని.

('సరికొత్త కథ' - కథా సంకలనం - 24 సెప్టెంబర్, 1995)